సంగారెడ్డి
నమస్తే తెలంగాణ
మంగళవారం 10 సెప్టెంబర్ 2024
TUESDAY, SEPTEMBER 10, 2024

పెసర్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవ రెడ్డి

తూకంలో రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

మనూరు, సెప్టెంబర్ 9: పంట ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి తూకం విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ సంజీవరెడ్డి సూచించారు. సోమవారం మనూనులో పెసర కొనుగోలు కేంద్రం ప్రారంభించిన సందర్భంగా మట్లాడారు. ప్రభుత్వం క్వింటా పెసర్లకు రూ.8,682 చెల్లిస్తుందని తెలిపారు. మార్క్‌ఫెడ్ అధికారుల ఆదేశాల ప్రకారం రైతులు పెసర్లు తీసుకువచ్చి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, ఏఓ మహేశ్ చౌహన్, ఏఈ ఓ సంగమేశ్వర్, మార్క్‌ఫెడ్ అధికారులు స్వప్న, శ్రీకాంత్, నాయకులు సిధారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గుండెరావు, రాజు, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన కర్ణాటక బస్సు

సదాశివపేట, సెప్టెంబర్ 9: కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఓ లారీని ఢీకొట్టింది. ఈ ఘటన మండల పరిధిలోని మద్దికుంట జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన బస్సు జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా లారీని ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో దాదాపు 20 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు. డ్రైవర్ అతివేగంగా బస్సు నడపడమే ప్రమాదానికి కారణమని బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు.

ఘటన స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

సంక్షేమాధికారులకు అండగా ఉంటాం

సంగారెడ్డి, సెప్టెంబర్ 9: జిల్లాలో వసతి గృహ అధికారుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ జిల్లా కమిటీ అండగా ఉంటుందని, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ అన్నారు. సోమవారం పట్టణంలోని టీఎన్జీవోస్ భవన్‌లో జిల్లా వసతిగృహ అధికారుల సంక్షేమ జిల్లా ఫోరాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీఎన్జీవోస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జావిద్ అలీ మాట్లాడుతూ వసతిగృహ అధికారుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్ అండగా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా కమిటీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని ప్రకటించారు. వసతిగృహ అధికారుల ఫోరం జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా బద్రి ప్రసాద్, అసోసియేట్ అధ్యక్షులుగా శంకరయ్య, నాగేశ్వర్‌రావు, కోశాధికారిగా బాలమణి, ఉపాధ్యాక్షులుగా నర్సింహులు, శివకుమార్, రవీందర్, రాధిక, సంయుక్త కార్యదర్శులుగా దుర్గేశ్, శోభారాణి, రామప్ప, వెంకటలక్ష్మి, కార్యనిర్వహక కార్యదర్శిగా సంతోష్, అధికార ప్రతినిధిగా వెంకటేశం, క్రీడల కార్యదర్శిగా మాణయ్య, సభ్యులుగా రాజిరెడ్డి, సువర్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు రవి, కసిని శ్రీకంత్, వెంకట్‌రెడ్డి, మాధవగౌడ్, భాస్కర్, మహేందర్, శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల వసతిగృహ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవోస్ అధ్యక్షుడు జావిద్ అలీ

కార్యాలయాలు ఏర్పాటు చేయండి

చౌటకూర్, సెప్టెంబర్ 9: నూతన మండలం చౌటకూర్‌లో ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఏర్పాటు చేయాలని పలువురు స్థానిక యువకులు సోమవారం తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. నాలుగేళ్ల క్రితం చౌటకూర్‌ను మండలంగా ఏర్పాటు చేశారని, ఇప్పటివరకు తహసీల్దారు కార్యాల యం మినహా మరే ఇతర కార్యాలయాలను ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పోలీస్‌స్టేషన్, మండల ప్రజా పరిషత్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ఇతర ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ఏదేని పని నిమిత్తం వెళ్లాలంటే 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న పుల్కల్‌కు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చౌటకూర్‌లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బోనోల్ల గంగారం, నత్తి గోపాల్ ఉన్నారు.

తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న చౌటకూర్ గ్రామస్తులు

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

సంగారెడ్డి, సెప్టెంబర్ 9: వాహనాల నుంచి వెలువడే కాలుష్యం వల్ల కలిగే నష్టాల గురించి తెలుసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్, శంకరయ్య సూచించారు. సోమవారం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి దినోత్సవం(నీలి ఆకాశం)పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తగులబెట్టడంతో వచ్చే పొగతో పట్టణవాసులు, వాహనదారులు శ్వాసకోస సమస్యలతో బాధ పడుతున్నారన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ పడిన సమయంలో వాహనాలను ఆఫ్ చేస్తే ఇందన వినియోగం తగ్గడంతో పాటు కాలుష్యాన్ని నియంత్రించ వచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ అజీముద్దీన్, ట్రాఫిక్ రైటర్ వీరేశం, హోంగార్డ్ ప్రభు పాల్గొన్నారు.

కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

రామబాణానికి పూజలు

రామచంద్రాపురం, సెప్టెంబర్ 9: అయోధ్య రాముడి కోసం చల్లా శ్రీనివాస శాస్త్రీ తయారు చేయించిన రామబాణాన్ని భక్తులు దర్శించుకొని పరవశించిపోతున్నారు. సోమవారం రామబాణాన్ని భారతీ నగర్ డివిజన్‌లోని కన్యకాపరమేశ్వరీ ఆలయానికి తీసుకువచ్చారు. కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి రామబాణాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

రామబాణానికి పూజలు చేస్తున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

నేటి నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు

సంగారెడ్డి, సెప్టెంబర్ 9: నేటి నుంచి 17 వరకు నిర్వహించనున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు మల్లికార్జున, జయరాజు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారోత్సవాల బుక్‌లెట్‌ను విడుదల చేసి మాట్లాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తికి భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెల్లో జరిగిన తెలంగాణ సాయుద రైతాంగ పోరాటాన్ని బీజేపీ మతరంగు పులిమి రాజకీయం చేస్తుందని ఆరోపించారు. కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాట ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేశారని గుర్తుచేశారు. పాలకుల దోపిడీని అరికట్టేందుకు మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, కార్యాలయ కార్యదర్శి కృష్ణ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ ఎదుట పీడీఎస్‌యూ ధర్నా

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 9: హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన విద్యార్థులు కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేశ్ మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, సొంత భవనాలను నిర్మించాలని, పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు పక్కా భవనాలు లేకపోవడంతో ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని గురుకులాల్లో ఇప్పటివరకు 36 మంది విద్యార్థులు చనిపోయారని, 500 మంది విద్యార్థులు విష ఆహారం తిని అనారోగ్యం పాలయ్యారన్నారు. వెంటనే ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, నాయకులు బన్ని, అనిల్, సిద్దు, సాత్విక, మల్లీశ్వరి, వాసు, పప్పి, సౌజన్య, హరిక, నవ్య, శిరీష పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 9: జిల్లా కేంద్రం ధర్నాలతో దద్దరిల్లింది. జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలంలో ఫార్మా విలేజ్, లైఫ్ సైన్సెస్ హబ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆయా గ్రామాల రైతులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఫార్మా విలేజ్ మాకోద్దని నినాదాలు చేశారు. మండలం నుంచి పెద్ద ఎత్తున రైతులు కలెక్టరేట్ వద్దకు చేరుకొని ధర్నా చేస్తుండగా, అదే సమయంలో హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో ర్యాలీగా వచ్చి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. దీంతో ప్రధాన రహదారికి ఇటువైపు రైతులు అటువైపు విద్యార్థుల నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. రైతులు అక్కడి నుంచి వెళ్లగానే స్థానిక ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చిన విద్యార్థులు కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డీఎస్పీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు అరెస్టు చేసి రూరల్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

కలెక్టరేట్ వద్ద రోడ్డుకు ఓ వైపు రైతులు, మరోవైపు విద్యార్థుల నిరసన

పంట నష్ట పరిహారం చెల్లించాలి

సదాశివపేట, సెప్టెంబర్ 9: భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని మంజీరా రైతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మలపల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని పొట్టిపల్లిలో నీట మునిగిన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎకరాకు రూ.40వేల పెట్టుబడి పెట్టి నష్టపోయారన్నారు. అధికారులు గ్రామాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని సూచించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు పంట నష్ట పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సంగన్న, మల్లన్న, వీరన్న, రజినీకాంత్, శ్రీనివాస్‌రెడ్డి, యాదప్ప తదితరులు పాల్గొన్నారు.

పొట్టిపల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న మంజీరా రైతు సమాఖ్య నాయకులు

రైతులు అధైర్యపడొద్దు

మునిపల్లి/రాయికోడ్, సెప్టెంబర్ 9: వారం రోజులుగా కురుస్తున్న వర్షానికి పొలాల్లో నిలిచిన వర్షపు నీటితో రైతులు ఏమాత్రం దిగులు చెందొద్దని రాయికోడ్ ఏడీఏ సత్యనారాయణ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, పిల్లోడి, తాటిపల్లి, రాయికోడ్‌తోపాటు దౌల్తాబాద్, సిరూర్ గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాహుల్, సరిత, ఏఈవోలు ఉన్నారు.

వర్షానికి దెబ్బ తిన్న పంటల పరిశీలన

న్యాల్‌కల్, సెప్టెంబర్ 9: వర్షాల నుంచి పంటల రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి అభినాష్ వర్మ సూచించారు. సోమవారం మండలంలోని రేజింతల్ శివారులో వర్షాలకు దెబ్బ తిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో పంటలకు తెగుళ్లు, చీడపురుగులు ఆశించి తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉన్నదన్నారు. అధికారుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకొని పంటలను కాపాడుకోవాలన్నారు. వర్షానికి గ్రామాల్లో మినుము, సోయాబీన్, కంది, పత్తి తదితర పంటలు వెయ్యి ఎకరాల వరకు దెబ్బతిన్నాయని, రైతులకు నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదికలను పంపనున్నట్లు పేర్కొన్నారు.

వ్యవసాయ అధికారి లేక అవస్థలు

మునిపల్లి, సెప్టెంబర్ 9: మునిపల్లి మండలానికి వ్యవసాయ అధికారి లేక మండలంలోని రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు ఎవ్వరికి చెప్పుకోవాలో తెల్వక అవస్థలు పడుతున్నారు. వారం నుంచి కురుస్తున్న వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బా తిన్నాయని, సూచనలు చేసే అధికారులు లేరని రైతులు వాపోతున్నారు. మునిపల్లి వ్యవసాయ అధికారి సస్పెండై పది రోజులు గడుస్తున్నా నూతన అధికారిని నియమించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించి వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నారు.

మునిపల్లి/రాయికోడ్: పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ సత్యనారాయణ

జంతు కళేబరాలతో నూనె తయారీ

న్యాల్‌కల్, సెప్టెంబర్ 9: మండలంలోని మల్లి గ్రామ శివారులో అనుమతి లేకుండా పశువుల ఎముకలు, కళేబరాల నుంచి నూనె తీస్తున్నారు. దీని నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే కార్మాగారాన్ని మూసివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం న్యాల్‌కల్ తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో తహసీల్దార్ భూపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మాగారంలో జంతువుల ఎముకలు, కళేబరాల నుంచి నూనె తయారు చేస్తున్న క్రమంలో వచ్చే దుర్వాసనతో పిల్లలు, పెద్దలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పొలాలకు వెళ్లే సమయంలో దుర్వాసనతో వాంతులు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కార్మాగారాన్ని మూసివేయించాలని కోరారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజలు

నిమజ్జనాలకు జాగ్రత్తలు తీసుకోవాలి

అందోల్, సెప్టెంబర్ 9: వినాయక నవరాత్రుల సందర్భంగా నిర్వాహకులు నిమజ్జనాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం జోగిపేటలో మండపాల నిర్వాహకులతో సమావేశమయ్యారు. మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనాలను ఒకే రోజు చేస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎస్సై పాండు, ఎంపీడీవో రాజేశ్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం

రామచంద్రాపురం, సెప్టెంబర్ 9: గణేశ్ నిమజ్జనాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పానగేశ్ అన్నారు. సోమవారం ఆర్సీపురం డివిజన్‌లోని రాయసముద్రం చెరువు వద్ద కోనేరును పోలీస్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్, ఎస్సై శశికాంత్ రెడ్డి, ట్రాఫిక్ ఏఎస్ఐ మల్లయ్య, ఏఈ ప్రభు, శ్రీను, కిరణ్‌గౌడ్, మల్లేశ్ తదితరులున్నారు.

మాట్లాడుతున్న సీఐ అనిల్‌కుమార్

కండక్టర్ బ్యాగులో నుంచి నగదు చోరీ

అందోల్, సెప్టెంబర్ 9: బస్సులో ప్రయాణిస్తూనే కండక్టర్ పర్సులో నుంచి నగదును దొంగిలించారు గుర్తు తెలియని వ్యక్తులు. ఈ విషయం కాస్త ఆలస్యంగా గుర్తించిన కండక్టర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి డీపోకు చెందిన బస్సు మెదక్ నుంచి సంగారెడ్డికి వెళ్తూ జోగిపేట బస్టాప్‌కు వచ్చింది. అక్కడ ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్తున్న సమయంలో కండక్టర్ త్రిమూర్తులు తన బ్యాగ్‌లో డబ్బులు చూసుకోగా రూ.8 వేలు తక్కువగా కన్పించాయి. జేబుల్లో ఎక్కడైనా పెట్టుకున్నానేమో? అని అన్ని చోట్ల వెతికినా డబ్బులు దొరకలేదు. బస్టాప్‌లో అనుమానితులను కొద్దిసేపు విచారించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై పాండు బస్టాప్‌లో సీసీ కెమెరాలు పరిశీలించినా ఎలాంటి ఆధారం లభించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు బస్సులో ఎక్కి బస్సు ముందుకు కదిలే సమయంలో డబ్బులు దొంగిలించి కిందకు దిగిపోయినట్లు ప్రయాణికులు చెప్పారు.

కాళోజీకి ఘన నివాళి

ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ యాసలో సామాజిక రచనలు చేసి ప్రజలను చైతన్యపర్చిన ప్రజాకవి, సామాజిక ఉద్యమకారుడు అని పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకొని కాళోజీ అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కాళోజీ ఉద్యమ స్ఫూర్తితో మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో మలి దశ ఉద్యమం ఉప్పెనలా ఎగిసిపడిందని, స్వరాష్ట్ర సాధన కేసీఆర్‌తోనే సాధ్యమైందని సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి అన్నారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, సెప్టెంబర్ 9



సంగారెడ్డి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

సంగారెడ్డి కలెక్టరేట్: పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో పద్మజారాణి

బొల్లారం: నివాళులర్పిస్తున్న కమిషనర్ మంగతాయారు, సిబ్బంది



పటాన్‌చెరు: గీతంలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

కల్హేర్: నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రమేశ్‌బాబు



వట్‌పల్లి: మర్వేళ్లిలో నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కోహీర్: కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తహసీల్దార్ బాలశంకర్, అధికారులు

వక్ఫ్ భూముల సమస్యలు పరిష్కరించుకుందాం

కోహీర్, సెప్టెంబర్9: జహీరాబాద్ డివిజన్‌లో ఉన్న వక్ఫ్ బోర్డు భూముల సమస్యలను పరిష్కరించుకుందామని రైతు హక్కుల సాధన సమితి కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జహీరాబాద్ పట్టణంలోని ఓ హోటల్‌లో రైతు హక్కుల సాధన సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ డివిజన్‌లోని ఆయా గ్రామాల్లో 13 వేల ఎకరాల వరకు వక్ఫ్ బోర్డు పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు అయ్యిందని వెల్లడించారు. ఈ నెల 11న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెన్షన్‌కు వస్తారని చెప్పారు. రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో వీరారెడ్డి, బస్వరాజ్ ఉన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

అందోల్, సెప్టెంబర్ 9: అందోల్–జోగిపేట మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఏర్పాటు చేసిన లైట్లతో పాటు డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన లైట్లకు మరమ్మతులు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తిరుపతి తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతోపాటు పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా పాలకవర్గం సహకారంతో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రజలు సైతం అభివృద్ధికి కృషి చేస్తూ స్వచ్ఛ మున్సిపాలిటీ కోసం సహకరించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

చౌటకూర్, సెప్టెంబర్ 9: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం అందజేశారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 35 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, కలాలి ఈశ్వర్‌గౌడ్, గోవర్ధన్‌ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, రామాగౌడ్, కైసర్, వర్కుల రమేశ్, చాకలి ఆగమయ్య, మాజీ సర్పంచ్‌లు గౌండ్ల బాలాగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

కోహీర్, సెప్టెంబర్ 9: విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 25న హైదరాబాద్‌లో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ కోరారు. సోమవారం జహీరాబాద్ డిగ్రీ కళాశాల ఆవరణలో డివిజన్ సబ్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో హరీశ్, విష్ణువర్ధన్, సురేశ్, లక్ష్మణ్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఝరాసంగం, సెప్టెంబర్ 9: కేతకీ సంగమేశ్వరాలయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న మొగులయ్య ఆదివారం అస్వస్థతకు గురై దవాఖానలో చేరారు. విషయం తెలుసుకున్న ఆలయ సిబ్బంది సోమవారం ఆయన చికిత్స నిమిత్తం రూ.51 వేల నగదు మొగులయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రమాదకరంగా చౌటకూర్ నాయిని చెరువు

చౌటకూర్, సెప్టెంబర్ 9: చౌటకూర్ శివారులోని నాయిని చెరువు ప్రమాదకరంగా మారింది. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులోకి పెద్ద ఎత్తున వరద వచ్చి చేరింది. అలుగుపై నుంచి పొలాలకు వెళ్లేందుకు రైతులు మట్టి, కంకర పోసి రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో అలుగు ఎత్తుగా మారి నీటి మట్టం పెరిగింది. నాసిరకంగా ఉన్న ఆనకట్ట ప్రమాదకరంగా మారింది. ఏ క్షణంలోనైనా ఆనకట్టకు గండిపడే ప్రమాదం ఉన్నదని రైతులు నీటి పారుదల శాఖ అధికారులకు తెలిపారు. స్పందించిన అధికారులు ఎక్సకవేటర్ సహాయంతో ఆనకట్టపై మట్టి పోస్తూ మరమ్మతు పనులు చేపడుతున్నారు.

తప్పిన పెను ప్రమాదం

బొల్లారం, సెప్టెంబర్ 9: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనగర్‌లో సోమవారం ఓ ఇంటి స్లాబ్ పెచ్చులూడి పడ్డాయి. కురుస్తున్న భారీ వర్షాలకు 30 ఏండ్ల భవనం తడిసి ముద్దయింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. భవనంలో నాలుగు కుటుంబాలు నివసిస్తున్నాయి. మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు క